

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కర్నూలు నంద్యాల

సోమవారం| 04 ఆగస్టు 2025

పేజీలు 8


- రోజురోజుకు పెరుగుతున్న పరిహారం మూల్యం
- ప్రస్తుతానికి కర్నూలులో ఒక 0.8 ఎంఎల్‌డి సామర్థ్యం గల ఎస్‌టిపి మాత్రమే పని చేస్తుంది..ఇది కేవలం వచ్చే వ్యర్థాలలో ఒక శాతం మాత్రమే
- 2ఎంఎల్‌డి ఎస్‌టిపి ప్రారంభ దశలోనే కొనసాగుతుంది



వ్యర్థ జలాలతో కలుషితమైన హంద్రీ నది

పైపుల ద్వారా హంద్రీ నదిలో కలుస్తున్న వ్యర్థ జలాలు

## కర్నూలు మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి

# పర్యావరణ శాఖ భారీ జరిమానా



హంద్రీ, తుంగభద్ర కలిసే కేంద్రం

## వ్యతిరేక భావం పోయింది..

# త్వరలోనే ఫలితాలు వస్తాయి..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌పై వైకాపా పాలనా సమయంలో ఏర్పడ్డ వ్యతిరేక భావం ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి మంత్రి నారా లోకేష్, తన పర్యటనతో తొలగి పోయింది, త్వరలోనే సింగపూర్ పర్యటన ఫలితాలు రాష్ట్రానికి అందుతాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి.భరత్ తెలిపారు. సింగపూర్ పర్యటనలో అక్కడి ప్రభుత్వ పెద్దలను, వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెద్దలతో తమ బృందం విస్తృతంగా చర్చలు జరిపిందని, ఏపిలో తిరిగి పెట్టుబడులు పెట్టేందుకు వారు ఆసక్తిని ప్రదర్శించారని ఆయన చెప్పారు. ఆదివారం కర్నూలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి సింగపూర్ పర్యటన విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, నారా లోకేష్‌ల పైప్రశంసలుకురిపించారు.చంద్రబాబు ప్రజ్ఞ, నారా లోకేష్ బుద్ధిబలం సింగపూర్ పర్యటనలో పరిశీలించిన తాను ఆశ్చర్యపోయానని ఆయన చెప్పారు. మరో రెండు దశాబ్దాలు రాష్ట్రంలో తెదేపా అధికారంలో ఉంటుందని ఆయన ధీమాగా చెప్పారు. సింగపూర్ పర్యటన విశేషాలను వివరించడంతో పాటు విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. మద్యం కుంభకోణం నిజమేనని, మాజీ సిఎం జగన్ మద్యం కుంభకోణం ఫ్రేమ్‌లో ఉన్నారని, ఆయనను ఎప్పుడైనా అరెస్టు చేయవచ్చేమోనంటూనే మిగతా 2లో

- సింగపూర్ పర్యటన సక్సెస్ అయ్యింది
- మద్యం కుంభకోణం వాస్తవం
- నాలుగైదు నెలల్లో కర్నూలుకు హైకోర్టు బెంచ్
- ఏపికి సహకరించేందుకు సింగపూర్ ప్రభుత్వం ఆసక్తి చూపిస్తోంది..
- చంద్రబాబు విజన్,లోకేష్ బుద్ధిబలం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది..
- అవిశ్రాంతంతగా ఏపి అభివృద్ధికి కృషి చేస్తుంటే వయస్సు మీరిందంటూ వైకాపా ప్రేలాపనలు
- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ.భరత్

## శ్రీశైల మల్లన్న సన్నిధిలో

# ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

- శ్రీశైలంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రత్యేక పూజలు
- రాజగోపురం వద్ద జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ కు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం



ప్రధాన న్యాయమూర్తికి రాజగోపురం వద్ద స్వాగతం పలుకుతున్న దృశ్యం

## 100శాతం సబ్సిడీ విత్తనాలు

# ఏమయ్యాయి?

- రైతులకు విత్తనాలు ఎక్కడ పంచిన దాఖలాలు లేవు ..?
- క్రిందిస్థాయి సిబ్బందిపై మండల వ్యవసాయాధికారి తీవ్ర ఒత్తిడి..?
- 10 శాతం విత్తనాలు పంపిణీ..90 శాతం విత్తనాలు స్వాహా..?
- తమకు న్యాయం చేయాలంటూ రైతుల ఆవేదన



పాములపాడు మండల వ్యవసాయ కేంద్రం దృశ్యం

## శ్రీశైలం డ్యాం అన్ని గేట్లు

# మూసివేత

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గడంతో డ్యామ్ అన్ని గేట్లను ఆదివారం అధికారులు మూసివేశారు. ఈ ఏడాది రెండోసారి జులై 23వ తేదీన డ్యాం రేడియల్ క్రస్ట్ గేట్లను అధికారులు ఎత్తివేశారు. 12 రోజులపాటు నాగార్జునసాగర్కు గేట్ల ద్వారా నీటిని విడుదలచేశారు. తాజాగా ఆదివారం ఆరు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న అధికారులు ఒక్కొక్క గేటును మూసివేశారు. సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,18,468 క్యూసెక్కుల వరద నీరు వచ్చి శ్రీశైలానికి చేరింది. కుడి,ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 65, 851 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్కువిడుదల చేశారు. అలాగే జలాశయంబ్యాక్ వాటర్ ద్వారా పోతిరెడ్డిపాడు మిగతా 2లో

- కొనసాగుతున్న వరద నీరు
- 882.10 అడుగులకు చేరిన నీటిమట్టం



శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేసిన దృశ్యం

# జీడీపీకి నిలిచిపోయిన ఎల్లెల్సీనీరు



గాజులదిన్నె ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు నిలువ ఉన్న దృశ్యం

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** జిల్లాలో ఎకైక మధ్యతరహానీటి పారుదల ప్రాజెక్టు అయిన (సంజీవయ్యసాగర్) గాజులదిన్నె ప్రాజెక్టుకు ఈ ఏడాది నీటి కష్టాలు రాన్నుట్లు తెలుస్తుంది. ఈ ఏడాది

- జీడీపీలో 1 టీఎంసీ నీరు మాత్రమే

ఆగస్టునెల ప్రారంభం అయినప్పటికి ఇప్పటి వరకు ప్రాజెక్టుకు ఒక్క సారి కూడా వరద నీరు వచ్చి చేరలేదు. ప్రస్తుతం కేవలం ప్రాజెక్టులో 1టీఎంసీ నీరు మాత్రమే ఉంది. ఇక వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతుందన్న ఆశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. రోజుకు ప్రాజెక్టు నుంచి అవిరి రూపంలో 30 నుంచి 50 క్యూసెక్కుల వరకు వృధా అవుతుంది. మిగతా 2లో

# వ్యతిరేక భావం పోయింది..త్వరలోనే ఫలితాలు వస్తాయి

(మొదటి పేజి తరువాయి)

ఆ విషయం తనకు తెలియదని అన్నారు. కర్నూలుకు మరో నాలుగైదు నెలల్లో హైకోర్టు బెంచ్ వచ్చే అవకాశం ఉందని మంత్రి నారా లోకేష్ తనతో చెప్పినట్లు ఆయన చెప్పారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయని ఆయన వివరించారు. కర్నూలు నగరంతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన చెప్పారు. తాము సింగపూర్ పర్యటనకు వెళ్లే ముందు ఏపిలో సౌకర్యాలు, వనరులు లేవ ంటూ ఇక్కడి కొందరు నేతలు అక్కడి వారికి ఇ.మెయిల్స్ చేశారని, ఎవరు చేశారో గుర్తించే పని జరుగుతోందని, వారిపై కఠిన చర్యలుంటాయని ఆయన చెప్పారు.

2019-24మధ్య కాలంలో వైసిపి ప్రభుత్వ తీరుతో ఐటి, పారిశ్రామిక రంగాలకు చెందిన వారు రాష్ట్రం వైపు కన్నెత్తి చూసేందుకు సాహసించడం లేదని, ఆ ప్రతికూలతను అధిగమించేందుకు సింగపూర్‌లో వివిధ వర్గాలతో పలు దఫాలుగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించామని చెప్పారు. సింగపూర్ ప్రస్తుత, మాజీ అధ్యక్షులతో పాటు వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులతో భేటీ నిర్వహించి ఏపిపై మళ్లీ నమ్మకం కలిగించగలిగామని వెల్లడించారు. కోండీ సిటీ రోబోటిక్ కారిడార్ వంటి ఆధునిక పారిశ్రామిక మోడల్‌లను పరిశీలించామని సింగపూర్‌లో మిషన్ ఆధారిత మానవ రహిత పరిశ్రమలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రత్యక్షంగా చూశామని తెలిపారు. సముద్ర తీరం ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఓడరేవులు నిర్మించాలన్నది చంద్రబాబు ఆలోచనగా ఉందని ఆయన చెప్పారు. సింగపూర్‌లో దశాబ్దాలుగా పటిష్టమైన ప్రభుత్వం ఉన్న కారణంగా అభివృద్ధి పరుగులు తీస్తోందన్న ఆయన మన దేశంలో గుజరాత్‌లో మూడు దశాబ్దాలుగా ఒకే ప్రభుత్వం కొనసాగుతున్న కారణంగా అక్కడి అభివృద్ధి మార్గదర్శకంగా ఉందని టి.జి.భరత్ చెప్పారు. 13 నెలల కాలంలో రాష్ట్రానికి 10లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకువచ్చామని, పరిశ్రమల పేర్లను గోప్యంగా ఉంచాల్సిన అవసరం పోటీ కారణంగా తలెత్తిందని ఆయన చెప్పారు.

ఓర్వకల్లులో రిలయన్స్ లాంటి దిగ్గజ సంస్థ పెట్టుబడి పెట్టబోతోందని, కోయంబత్తూరు కంపెనీ ఇక్కడికే వస్తుందని, ఇప్పుడు బాంబేకు చెందిన దిగ్గజ కంపెనీ కూడా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిందని ఆయన చెప్పారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో పైలెట్ శిక్షణకు రెండు సంస్థలు ముందుకు వచ్చాయని, దీన్ని చేస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కంటే ఎక్కువ జీతం వస్తుందని ఆయన చెప్పారు. ఓర్వకల్లు విమానాశ్రయాన్ని పిపిపి (పబ్లిక్, ప్రైవట్ పార్ట్నర్ షిప్)లో ప్రైవేట్ సంస్థలు వ్యక్తులకు ఇవ్వబోతున్నామని, ఇప్పటికే దీనికి సంబంధించి ప్రకటన వచ్చిందని ఆయన చెప్పారు. ఓర్వకల్లుకు పెద్ద ఎత్తున పరిశ్రమలు రాబోతున్న నేపథ్యంలో విమానాశ్రయ నిర్వహణ లాభదాయకంగా ఉండవచ్చని ఆయన చెప్పారు.

టిడ్కో గృహాలను నివాసయోగ్యంగా మార్చి ప్రజలకు త్వరలో అందించనున్నామని, ఆరు నెలల్లో టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు పూర్తి కానున్నాయని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభవమని, ఆయన అలుపెరుగని కృషి ఏపి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని, ఏపి సమగ్రాభివృద్ధి ఎంతో దూరంలో లేదని ఈ విజయాన్ని కేవలం 13నెలల్లో సాధించగలిగిన నాయకత్వం చంద్రబాబుదేనని అన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు వయసు మీరిపోయారని, మహిళా ఎమ్మెల్యేలపై నీచంగా వైకాపా నేతలు మాట్లాడుతున్నారన్న ఆయన వారు తీరు మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కదని హెచ్చరించారు. వైకాపా నేతల మాట తీరు అసహ్యంగా ఉందని టి.జి.భరత్ అన్నారు.

# కర్నూలు మున్సిపాలిటీ నిర్లక్ష్యానికి పర్యావరణ శాఖ భారీ జరిమానా

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థ జలాల శుద్ధి కేంద్రాలు (ఎస్‌టిపి) నిర్మించకపోవడం వ్యర్థ జలాలను నేరుగా హంద్రీ, తుంగభ్రద నదుల్లోకి విడుదల చేయడం వల్ల పర్యావరణానికి త్రీవ నష్టం జరుగుతుందని జాతీయ హరిత న్యాయస్థానం(ఎన్‌జిటి) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆదేశాలను పదే పదే లెక్కచేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నియంత్రణ మండలి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌పై రూ.5కోట్ల20లక్షల పర్యావరణ పరిహారం విధించింది. కానీ ఇప్పటికీ ఆ మొత్తం చెల్లించబడలేదు.

**పరిహారానికి కారణాలు :**

ఫిబ్రవరి 2017లో సుప్రీం కోర్టులో ఎస్‌టిపిలు, సిఈటిపిలు నిర్మాణం కోసం మూడేళ్ల గడువు ఇచ్చింది.

ఫిబ్రవరి 2020లో ఎన్‌జిటి ఆదేశాల ప్రకారం ఎస్‌టిపిలు ప్రారంభించకపోతే ప్రతి నెలకు రూ.5లక్షలు, పూర్తి చేయకపోతే ప్రతి నెలకు రూ.10లక్షలు జరిమానా విధించాలని నిర్ణయం తీసుకుంది.

డిసెంబరు 2020లో పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి కర్నూలు షోకాజు నోటీసులు ఇచ్చి కెఎంసికి కారణం చెప్పమంది.

జనవరి 2021లో కెఎంసి సమాధానంలో ఎస్‌టిపిలు ప్రతిపాదించినట్లు తెలిపింది. కానీ పని ప్రారంభం కాలేదు.

మార్చి 2021లో ఏపిపిసిబి రూ.5కోట్ల 20లక్షల పర్యావరణ పరిహారం చెల్లించాలని కెఎంసికి ఆదేశించింది.

జూన్ 2021 మరియు నవంబరు 2021లో మళ్లీ రిమైండర్ నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. మళ్లీ డిసెంబరు 2024లో తుది ఆదేశం ఇచ్చి మూడు నెలల్లో పరిహారం వసూలు చేయాలని పర్యావరణ శాఖకు ఆదేశించింది. ప్రస్తుత మార్చి 2025తాజా రిపోర్టు ప్రకారం ఇప్పటికీ పరిహారం చెల్లించబడలేదని ఏపిపిసిబి స్పష్టం చేసింది.

**కెఎంసి నిర్లక్ష్యం చట్టపరమైన ఉల్లంఘనలు :** కెఎంసి రోజుకు సుమారు 70ఎంఎల్‌డి వ్యర్థ జలాలను ఉత్పత్తి చేస్తుంది. ప్రస్తుతం కేవలం 3చిన్న ఎస్‌టిపిలు (0.8 ఎంఎల్‌డి) సామర్థ్యం మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి మాత్రమే పనిచేస్తుంది. ఇంకా 13ఎస్‌టిపిల నిర్మాణం



పనిచేయని 0.8ఎంఎల్‌డి ఎస్‌టిపి కేంద్రం

జరగలేదు. దీనివల్ల తుంగభద్ర, హంద్రీ నదుల్లో వ్యర్థ జలాలు నేరుగా చేరుతున్నాయి. సుప్రీం కోర్టు మరియు ఎన్‌జిటి ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను కెఎంసి పదే పదే లెక్క చేయలేదు. 2016నుండే ఎన్‌జిటి పర్యవేక్షణలో ఉన్న గడువుల్లో ఎస్‌టిపిలు పూర్తి చేయలేదు. నదుల కాలుష్యం, నివారణకు తీసుకోవాల్సిన తాత్కాలిక చర్యలు (ఫైటోరిమీడియేషన్-బయోరిమీడియేషన్) చేయలేదు.

**పర్యావరణంపై ప్రభావం :** మలిన జలాలు నేరుగా నదుల్లో కలవడం వలన తుంగభ్రద, హంద్రీనదులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయి. ఇవి చివరకు కృష్ణా నదిలో కలుస్తాయి. దీని వలన తాగునీటి నాణ్యతపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని ఏపిపిసిబి ఆందోళన వ్యక్తం చేసింది.

**పరిహారం చెల్లింపు ఎక్కడి నుండి :** రూ.5కోట్ల 20లక్షల పరిహారం చెల్లించాల్సి వస్తే కెఎంసికి పెద్ద ఆర్థిక భారమవుతుంది. ప్రత్యేక నిధులు లేదా రాష్ట్ర ప్రభుత్వ సహాయం లేకపోతే ఈ మొత్తం సేకరించడం కష్టమేనని అధికారులు అంటున్నారు. కానీ ఈ మొత్తాన్ని చెల్లించకపోతే ప్రతి రోజు అదనపు జరిమానాతోరూ.15కోట్ల వరకు పెరిగేఅవకాశం ఉంది.

**ముందు తీసుకోబోయే చర్యలు :** ఏపిపిసిబి తాజా రిపోర్టు ప్రకారం పరిహారం చెల్లించని కె ఎంసి పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులను కన్సెంట్ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి పిలిపించి సమీక్షించే అవకాశం అవసరమైతే చట్టపరమైన మరింత కఠిన చర్యలు కూడా తీసుకోవచ్చునే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# సంకల్ప దివాస్ దిగ్విజయంగా నిర్వహించాలి

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :**

అఖండ భారత్ సంకల్ప దివాస్ కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించాలని దక్షిణాంధ్ర ప్రాంత ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు ఆదిత్య హైస్కూల్‌లో జిల్లా కార్యక్రమాన్ని కార్యకర్తల సమక్షంలో నిర్వహించారు. రాబోయే రోజుల్లో జరిగే అఖండ భారత్ సంకల్ప దివాస్ కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టిసి మద్దిలేటి, ఉపాధ్యక్షులు వాసుదేవయ్య, సామాజిక సమరస్త విభాగ ప్రముఖ గోరంట్ల రమణ, స్వాత్మానంద స్వామి, ప్రాంత కోశాధికారి సందడి మహేశ్వర్, ప్రఖండ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# శ్రీశైలం డ్యాం అన్ని గేట్లు మూసివేత

(మొదటి పేజి తరువాయి)

హెడ్ రెగ్యులేటర్‌కు 35 వేల క్యూసెక్కులు,హెచ్ఎన్ఎస్ఎస్ కు 3,225 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.గడచిన 24 గంటల వ్యవధిలో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 29,869 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 15.046 మిలియన్ యూనిట్ల విద్యుత్, ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 39,259 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 17,027 మిలియన్ యూనిట్ల విద్యుత్ను ఉత్పత్తి చేశారు.ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 882.10 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 199.7354 టీఎంసీలుగా నమోదైంది.

## శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ప్రధాన న్యాయమూర్తి దంపతులకు ఈవో ఎం.శ్రీనివాసరావు, పలువురుఅధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.శ్రీ స్వామి అమ్మవార్ల ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు వల్లించగా..ఈవో శేష వస్త్రం,లడ్డూ ప్రసాదాలు, చిత్రపటంతో ప్రధాన న్యాయమూర్తిని సత్కరించారు.



శ్రీ స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

# 100శాతం సబ్సిడీ విత్తనాలు ఏమయ్యాయి..?

Your Otp 6135 , Against
OtpId 15314063 , Crop:
BLACK GRAM (URD
BEAN) ,Variety:
VBN-8(Minikits), Bags
allotted: 1 (4 kgs)Acres:
0.14, Subsidy Amount
in Rs. 508, Non Subsidy
Amount payable in Rs.0
Village: MITTAKANDALA
Mandal:
PAMULAPADU-GOVTA

Your Otp 4342 , Against
OtpId 15314066 , Crop:
BLACK GRAM (URD
BEAN) ,Variety:
VBN-8(Minikits), Bags
allotted: 1 (4 kgs)Acres:
0.91, Subsidy Amount
in Rs. 508, Non Subsidy
Amount payable in Rs.0
Village: MITTAKANDALA
Mandal:
PAMULAPADU-GOVTA

Your Otp 3883 , Against
OtpId 15223026 , Crop:
SOYBEAN
(BHAT) ,Variety:
KDS-726
CS(30Kg)VCC, Bags
allotted: 3 (90
kgs)Acres: 0.51,
Subsidy Amount in Rs.
9900, Non Subsidy
Amount payable in Rs.0
Village: MITTAKANDALA
Mandal:

రైతుల సెల్‌ఫోన్లకు ప్రభుత్వ సందేశాలు

**పాములపాడు మేజర్ న్యూస్ :** రైతులకు విత్తనాలు ఉచితంగా అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి కొంత మంది వ్యవసాయ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. పాములపాడు మండల పరిధిలోని మద్దూరు, మిట్టకందాల, వేంపెంట, చెలిమిళ్ళ, పాములపాడు గ్రామాలలో రైతులకు 100శాతం సబ్సిడీ ద్వారా సోయాబీన్, మినుములు, కంది, విత్తనాలను 100 శాతం సబ్సిడీ అందించేందుకు ప్రభుత్వం విత్తనాలను మంజూరు చేసింది.అయితే రైతులకు ప్రభుత్వం అందించిన విత్తనాలను మండల వ్యవసాయ అధికారి నిర్వాహకంతో రైతులకు దక్కాల్సిన సబ్సిడీ విత్తనాలు బ్లాక్ మార్కెట్కు తరలించినట్లు సమాచారం.బ్లాక్ మార్కెట్‌కు తరలించిన విషయం బయటపడకుండా రైతులకు విత్తనాలను పంచినట్లు లెక్కల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి చిత్రీకరిస్తూ..క్రిందిస్థాయి సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేసి సబ్సిడీ విత్తనాలు మాయం చేశారని ఆరోపణలు మండలంలో బలంగా వినిపిస్తున్నాయి. రైతుల సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు వచ్చిన.. వారికి చదువు రాదు అనే విషయాన్ని గ్రహించిన అధికారులు ఇదే అదునుగా చేసుకొని రైతులను మోసం చేస్తున్నారని కొందరు రైతులు ఆరోపణలు చేస్తున్నారు.మరి కొందరు రైతులు సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లను గుర్తించి వ్యవసా యాధికారులను ప్రశ్నించగా అవి పాత మేసేజ్‌లు అంటూ..ఫేల్యూర్ వచ్చాయని వెన్నక్కు పంపుతు న్నారని సమాచారం. మరి కొందరు రైతులు గట్టిగా అడుగగా10శాతం మందికి మాత్రమే సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసినట్లు సమాచారం.90 శాతంవిత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలించినట్లు సమాచారం.అంతే కాకుండా పాములపాడు మండల వ్యవసాయశాఖ అధికారి బాధ్యతలు స్వీకరించి వచ్చిన కొత్తలోనే ఒక ఎరువుల దుకాణంలో యూరియా అధికధరలకు వికరిస్తున్నావు అంటూ ఆడీలర్ వద్ద నుండి పెద్ద మొత్తంలోనే డబ్బును లాగారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మండల వ్యవసాయాధికారి నిర్వాకంతో ప్రభుత్వం నుండి అందాల్సిన సబ్సిడీ విత్తనాలు రైతులకు అందక బయట అధిక ధరలకు విత్తనాలను కొనలేక తీవ్రంగా నష్టపోతున్నా మని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు.దేవుడు కరుణించిన పూజారి కరుణించిడం లేదన్న చందంగా వ్యవసాయా ధికారుల తీరు మారిందని రైతులు నాగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.







# ఉద్యోగుల సమస్యలపై " రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం"

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యకులు నాగేంద్రప్ప**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల ఆగస్టు 5వ తేదీన నంద్యాల జిల్లాలో "రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం" అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యకులు నాగేంద్రప్ప తెలిపారు.స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్య నారాయణ ఇచ్చిన పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలతో పాటు ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలపై ఉద్యోగులతో "టీ" త్రాగుతూ చర్చించడం జరుగుతుందన్నారు. మూడు నెలల కాలంలో వారానికి ఒక సమస్యను లేవనెత్తి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలు సుమారు 35 వేల కోట్ల రూపాయలకు సంబంధించిన బకాయిలు మరియు దాదాపుగా 27 రకాల సమస్యలను 'రండి టీ త్రాగుతూ మాట్లాడుకుందాం' అనే కార్యక్రమం ద్వారా రాబోయే మూడు నెలల పాటు జిల్లా లోనీ అన్ని తాలూకా లలో వివిధ శాఖల పరిధిలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ముందుకు ఎలా తీసుకెళ్లాలో అనే విషయం పై ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాలజిల్లా, తాలూకా కార్యవర్గ సభ్యులకు సూచించడం జరిగిందని జిల్లా అధ్యక్షులు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యలపై ఈ చర్చా వేదికల్లో చర్చించి రాష్ట్ర సంఘం ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 5వ తేదీన జరిగే కార్యక్రమంలో ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన సుధాకర్‌ను సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆళ్ళగడ్డ తాలూకా వ్యవసాయశాఖ ఏడిఏ విజయశేఖర్ ముఖ్య అతిథిగా,జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప, జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు,సహా అధ్యక్షులు శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ కుమార్, ఫక్రుద్దీన్, విజయలక్ష్మి, సిటీ అధ్యక్షులు సత్యం, సహా అధ్యక్షులు వెంకట శివన్న కోశాధికారి వెంకట చక్రదర్, ఉపాధ్యక్షులు యేసురత్నం జిల్లాలోనిఆత్మకూరుఅధ్యక్షులు మస్తానయ్య, కోశాధికారివెంకటరమణయ్య,నందికొట్కూరుతాలూకాఅధ్యక్షులు నర్సరాజు, కార్యదర్శి భువనేశ్వరి, ఉపాధ్యక్షులు మద్దిలేటి, డోన్ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్, ఆళ్ల గడ్డ తాలూకా కార్యదర్శి హాజరయ్య, సహా అధ్యక్షులు నాగరాజు, బనగానపల్లి తాలూకా కార్యదర్శి చంద్రశేఖర్ మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప

# నేడు ముచ్చిగేరిలో శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహప్రతిష్ఠాపన



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** మంత్రాలయం నియోజకవర్గం. పెద్దకడుబూరు మండల పరిధిలోని ముచ్చిగేరి గ్రామంలో ఈనెల 4వ తేదిన శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి విగ్రహప్రతి ష్టాపన గ్రామ పెద్దలు అద్వర్యంలో జరుగుతాయని గ్రామ పెద్దలు శనివారం విలేకరులకు తెలిపారు. అలాగే శ్రీ శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహప్రతిష్టాపన చేసేందుకు పలువురు ప్రము ఖులు రానున్నారని వారు తెలిపారు. అలాగే 3వతేదిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన చేసేందుకు ముందుగా విగ్రహాన్ని శుద్ధి చేసి ఆతరువాత ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.4వతేదిన సోమవారం ఉదయం 11.45 గంటలకు శ్రీశ్రీశ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతి ష్టాపన కార్యక్రమం జరుగుతుందిని వారు తేలియ జేస్తారని వారు చెప్పారు. ఈ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి వాల్మీకీలు అందరు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపు ఇచ్చారు.

# విద్యుత్ సరఫరా వేళలో స్వల్ప మార్పులు



**పెద్దకడుబూరు,మేజర్ న్యూస్ :**పెద్దకడుబూరుమండలంలో విద్యుత్ సరఫరా వేళలో స్వల్ప మార్పులు ఉంటాయని మండల విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం పెద్దకడుబూరులో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో హెచ్.మురువణీ.పెద్దకడుబూరు విద్యుత్ సబ్ స్టేషన్‌పరిదిలోని రైతులకు వర్ష భావ పరిస్థితుల వల్లన అధికంగా కరెంటు లోడ్ పెరిగి నందున పగటి వేళలో9గంటలకు విద్యుత్ సరఫరా ఇవ్వలేక పోతున్నామని ఆయన చెప్పారు.అందువలన సోమవారం రోజు నుంచి రాత్రి 3గంటల నుండి తెల్లవారుజాము 6గంటల వరకు విద్యుత్ సరఫరా చేయబడుతుందనిఅందువల్ల రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని అయన రైతాంగాన్ని కోరుతున్నారు.

# వైద్య విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** కెఎంసి కళాశాలలో వైద్య విద్యార్థులు స్నేహభావంతో మెలిగి విద్యార్థి దశ మరపురాని అనుభూ తులతో తిరిగి వెళ్లాలని కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అన్నారు. ఆదివారం మెడికల్ కళాశాలలోని యూజీ హాస్టల్‌లో ఫ్రెండ్‌షిప్ డే కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ సీనియర్, జూనియర్ విద్యార్థు ల మద్య స్నేహబంధాలు మరపురాని అనుభూతుల్లో ఉండాలన్నారు. తెలిసో..తెలియకో..అనవసర విషయా లు జోక్యం చేసుకుని మీ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు. సీనియర్, జూనియర్ వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూజీ హాస్టల్ వార్డెన్, ప్రొఫెసర్ డా. నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్, అసిస్టెంట్ వార్డెన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వెంకటేశ్వర్లు, పిఆర్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ప్రిన్సిపల్ డా చిట్టి నరసమ్మ

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు క్రీడా వస్తువులు అందజేత



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** నంద్యాల మిడ్ టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షులు కేశవమూర్తి , కార్యదర్శివెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల మసీదుపురం (మహానంది మండలం) ప్రధానోపాధ్యాయులు జాకీర్ హుస్సేన్‌కు విద్యార్థుల క్రీడలకు ఉపకరించే సామాగ్రినిఅందజేయడం జరిగింది.నంద్యాల పట్టణంలోని రోటరీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యా వికాసానికి తమ క్లబ్ సభ్యులు ముందుకు రావడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు డివి సుబ్బయ్య, కాల్వ నాగరాజు ,ప్రసాద్, రమేష్, శేషఫణి,అన్నెం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో వసతుల కల్పనకు చర్యలు

**– తిరుపతి రైలు కోవెలకుంట్లలో ఆగినందుకు ఎంపీ బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు**

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** రాయలసీమలో ప్రత్యేక స్థానం, చారిత్రాత్మక విశిష్టత కలిగిన కోవెలకుంట్ల రైల్వే స్టేషన్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జోనల్ వినియోగదారుల కన్సల్టెంట్ మెంబర్ వెంకటరంగయ్య అన్నారు. ఆదివారం కోవెలకుంట్ల రైల్వే స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు పలు సూచనలు, సలహాలు అందించారు. స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తాగేందుకు మంచినీటి సౌకర్యం లేదని రైల్వే స్టేషన్ వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని పలువురు ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రైల్వే స్టేషన్ మాస్టర్ పంకజ్ కుమార్‌తో సమావేశమై స్టేషన్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు, తిరుపతి రైలు కోవెలకుంట్లలో ఆపేందుకు నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగందని అందుకే తిరుపతి రైలు స్టాపింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే నాందేడ్, తిరుపతి మధ్య స్పెషల్ ట్రైన్‌ను కోవెలకుంట్లలో ఆపేందుకు ఎంపీ చొరవ తీసుకోవడం పట్ల పలువురు ప్రయాణికులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపినట్లు వెంకటరంగయ్య తెలిపారు. కోవెలకుంట్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోవెలకుంట్ల, బనగానపల్లె రైల్వే స్టేషన్‌లలో రైలు టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే స్టేషన్‌లో రైలు పేరు, డిస్ప్లే బోర్డులు, బోగీల వరుస క్రమ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారని అన్నారు. ఉదయం పూట డెమో ట్రైన్‌లో టాయిలెట్ సౌకర్యం ఉన్న బోగీలు ఏర్పాటు చేయాలని, మహిళలు, చిన్న పిల్లలు, సీనియర్ సిటిజన్ల కోసం పగటి పూట రేణిగుంట నుంచి నంద్యాల, రేణిగుంట నూతన మెమూ ట్రైన్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణికుల ఇచ్చిన సూచనలు సలహాలను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ద్వారా రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని వెంకటరంగయ్య తెలిపారు.


రైల్వే అధికారులతో మాట్లాడుతున్న వెంకటరంగయ్య

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

**:– జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఒడాలని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.


అవగాహన కల్పిస్తున్న త్రీటౌన్ ఎస్ఐ నరసింహులు

# హాస్టల్‌లో మౌళిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించండి

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ పరిధిలోని హాస్టల్లో మౌళిక సదుపాయాలను కల్పించడం, పారిశుద్ధ్యంపై దృష్టి, తాగునీటి వసతి వంటి సదుపాయాలను హాస్టల్ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా దృష్టి సారించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాంపురంలోని భీమా నిలయంలో మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు హాస్టళ్ల వార్డెన్లు అజీమ్, గోపాల్, సత్యనారాయణరాజులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హాస్టళ్ల నందు సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే తమ వంతు సహాయ సహాకారాలను అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఏ వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను కలిసిన వార్డెన్లు

# బుగ్గన అర్జున్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి వివాహం సందర్భంగా మండల పరిధిలోని కలచట్ల గ్రామంలోని శ్రీఆంజనేయ స్వామి గుడిలో వైకాపా నాయకులు పోతిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఆద్వర్యంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు.అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలలో కులమతాలకు అతీతంగా బుగ్గన అర్జున్‌అమర్‌నాథ్‌రెడ్డి దంపతుల పేరిట అర్చనలు, ప్రత్యేక ప్రార్థనలు వైకాపా నాయకులు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో నభిరసూల్ ఆధ్వర్యంలో గ్రామంలోని సద్గురు గుడికల్ అల్లిపీరా స్వాముల వారికి మందిరంలో తెల్లవారుజామున 5:35 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేసి, నూతన వధూవరులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.


కేక్‌ను కట్ చేస్తున్న కలచట్ల గ్రామ వైకాపా నాయకులు, కార్యకర్తలు

# అవయవ దానం ప్రానదానంతో సమానం




మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా వెంకటేశ్వర్లు

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** సమాజంలోని ప్రతిఒక్కరు మంచి మనసుతో అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం 15వ భారతీయ అవయవ దాన దినోత్సవంలో భాగంగా అంగ్‌దాన్ జీవన్ సంజీవని అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో వైద్య విద్యార్థు లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు స్వచ్ఛంధం గా క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. అన్ని దానాల్లో కల్లా అవయవ దానం గొప్పదన్నారు. మనిషి మరణించిన తర్వాత దేహం మట్టిలో కలిసిపోతుందని అవసరమైన వారికి దానం చేసి వారి జీవితానికి పునర్జన్మ అందించిన వారవుతారన్నారు. అనుకోని సంఘటన వలన మరణించిన ఒక వ్యక్తి అవయవ దానం చేస్తే 8మంది జీవితాల్లో వెలుగు నింపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీరాములు, అడ్మినిస్ట్రేట ర్ సింధూ సుబ్రమణ్యం, యూరాలజీ ఇంచార్జ్ ప్రొఫెసర్ డా. ముత్యశ్రీ, నెఫ్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా వెంకటప్పకిరెడ్డి, హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. శివబాల, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కిరణ్ కుమార్, సునీల్, ప్రశాంత్ నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నోడల్ అధికారులు వార్డుల్లో పర్యటించండి

**నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం**



**కర్నూలు క్రైమ్, మేజర్ న్యూస్ :** నగరంలో ఇటివల 52 వార్డులకు నియమించిన నోడల్ అధికారులు వార్డుల్లో సోమవారం నుండి పర్యటించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆదివారం ఆయన నోడల్ అధికారులు, విభాగాధిపతులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సోమవారం నుంచి ఉదయం 7:30 గంటల నుండి 9 గంటల వరకు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఆస్తి, వినోద పన్నులు, ట్రేడ్ లైసెన్స్ రుసుములు, తాగునీటి కొళాయి చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మొండి బకాయిదారులకు నోటిసులు జారీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, వియల్‌టి పన్నుల డిమాండ్లకు తగట్టు రాబట్టాలని పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, విభాగధిపతులు, అధికారులు చెబుతున్నారు.

# తల్లిపాలు తల్లి ఆరోగ్యానికి మంచివి



విజయ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి

**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** ప్రసవం తర్వాత పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వలన తల్లికి కూడా ఆరోగ్యకరమని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు ప్రసవం తర్వాత తల్లిపాలు ఇవ్వడం వలన తల్లి వేగవంతంగా కోలుకుంటుందన్నారు. పాలు పట్టడం వలన ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలై గర్భాశయం దాని సాధారణ స్థితికి వచ్చి రక్తస్రావం తగ్గిస్తుందన్నారు. తల్లికి 500 లేక 600క్యాలరీలు ఖర్చు అవుతాయి ముందు గర్భధారణకు ముందు ఉన్న బరువుకు వస్తారని రొమ్ము అండాశయం గర్భాశయం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. సాధారణ జననం తనంతరం రుతుస్రావం తిరిగి రావడానికి ఆలస్యం చేస్తుందన్నారు. సహజంగా జనన నియంత్రణ పద్దతిగా పని చేస్తుందన్నారు. తల్లి మానసిక, బావోద్వేగం, ఆరోగ్యం, నిరాశ ప్రమాదం తగ్గుతుందన్నారు. తల్లి విశ్వాసం, సంతృప్తి పెరుడుతుందన్నారు. స్టెరిలైజేషన్ అవసరాన్ని తగ్గిస్తుందని, తల్లిపాలు పట్టడం వలన ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చన్నారు.

# ఆహ్లాదకరంగా పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** అలనాటి జ్ఞాపకాలు, ఆనాటి మధురమైన సృతులు, అప్పటి అల్లరి పనులను జ్ఞప్తికి చేసుకుంటూ ఎంతో ఆహ్లాదకరంగా 2001-2002 సంవత్సరం పదవ తరగతి కలిసి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక అనేక అనుభవాలను గుర్తుకు చేసుకుంటూ కొనసాగింది. ఆదివారం పట్టణ సమీపంలోని అబ్బిరెడ్డిపల్లె చెరువు దగ్గర పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మెళనంలో 2001-2002 విద్యార్థులు ఎంతో ఆనందంగా, సంతోషంగా నిర్వహించుకున్నారు. అనంతరం భవిష్యత్తు కార్యచరణపై స్నేహితులు ఒకరికి ఒకరు చర్చించుకున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వపు విద్యార్థులు

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై స్వచ్ఛత పనులు**

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**కర్నూలు క్రైమ్, మేజర్ న్యూస్ :** నగరంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రధాన రహదారులపై రాత్రివేళల్లో స్వచ్ఛత పనులను ప్రారంభించామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం ఆయన పూలబజార్,పాతఈద్గా, బళ్లారి చౌరస్తా తదితర ప్రాంతాల్లో రాత్రిపూట జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగాకమిషనర్‌మాట్లాడుతూ.. పగటిపూట ప్రధాన రహదారులపై పారిశుద్ధ్య పనులను నిర్వహించడానికి ట్రాఫిక్ ఆటంకం కలుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాత్రి 10 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల వరకు రాత్రి వేళలో ప్రధాన రహదారులపై స్వచ్ఛత పనులు ప్రారంభించామన్నారు. సుమారు 100 మంది పారిశుద్ధ్య సిబ్బంది, ప్రత్యేక వాహనాలతో ఆదివారం నుండి పనులు ప్రారంభించామన్నారు. రహదారులను



శుభ్రం చేసే 3 స్లీపింగ్ యంత్ర వాహనాలను సైతం వినియోగిస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారిడాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, పారిశుద్ధ్యపర్యవేక్షక అధికారి నాగరాజు, తనిఖీదారులు మునిస్వామి, జిలాని, వలి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అందరూ మేల్కొవాలి

**డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ డాక్టర్ గార్లపాటి మద్దులేటిస్వామి**

**డోన్, మేజర్‌న్యూస్:** భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, ప్రధానమంత్రి మోదీ అన్ని వ్యవస్థలను తన కంట్రోల్‌లో ఉంచుకున్నారనీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడంలో అందరూ మేల్కొనాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు భారతదేశం, దాని రాజ్యాంగం, ప్రజాస్వామ్య నీతికోసం నిలబడుతుందని డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, న్యాయవాది, డాక్టర్ గార్లపాటి మద్దులేటిస్వామి అన్నారు. ఈనెల 2వ తేది శనివారం ఢిల్లీలో ప్రముఖ న్యాయవాది, పార్లమెంటేరియన్ డాక్టర్ అభిషేక్‌మను సింఘ్వి ఆధ్వర్యంలో ఏఐసిసి లా డిపార్ట్‌మెంట్ వారు నిర్వహించిన



ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలకు ఎదురౌతున్న ప్రమాదాలపై చర్చ అనే అంశంపై కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, న్యాయవాది, డాక్టర్ గార్లపాటి మద్దులేటిస్వామి హాజరైయ్యారు. ఈ సందర్భంగా డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, న్యాయవాది, డాక్టర్ గార్లపాటి మద్దులేటిస్వామి మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం సంతోషకరంగా ఉందని, ఈ సమావేశానికి తనను ఎంపిక చేసిన రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైయస్.షర్మిలారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మినరసింహ యాదవ్, రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సోమశేఖర్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాదులు సల్మాన్‌ఖుర్షిద్, మొహమ్మద్ అలీఖాన్, విపుల మహేశ్వరి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, సోమశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రముఖ న్యాయ నిపుణులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా ఈవి రమణ ప్రమాణ స్వీకారం

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు మండలం ఉలిందకొండ వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన ఈవి రమణ, డైరెక్టర్లు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, ఉమ్మడి జిల్లా టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డిలు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, గౌరు వెంకటరెడ్డి, గౌరు జనార్థన్ రెడ్డిలను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు గౌరు జనార్థన్ రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, ఏపి సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ఆదెన్న, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, కల్లూరు



గౌరు దంపతులను గజమాలతో సన్మానించిన నాయకులు

మండల పరిధిలోని అన్ని గ్రామాల కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవరం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

**- రుద్రవరం ఎంపిడిఓకు చెక్ పవర్**

**- ఉత్తర్వులు జారీ చేసిన డిపిఓ**

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ బైరి విజయలక్ష్మి చెక్ పవర్ రద్దు చేస్తూ నంద్యాల డిపిఓ లలితాబాయి ఉత్తర్వులు జారీ చేశారు. రుద్రవరం ఎంపిడిఓ భాగ్యలక్ష్మికి చెక్ పవర్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే...గత వైసీపీ ప్రభుత్వంలో రుద్రవరం గ్రామ పంచాయితీలో రూ.2.13 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయి. నిధుల దుర్వినియోగంపై సూర్య దినపత్రికలో ఈ ఏడాది ఫిబ్రవరి 1వతేదిన రుద్రవరం మేజర్ పంచాయతీలో రూ.1.82 కోట్ల నిధుల దుర్వినియోగం అన్న శీర్షిక వార్తా కథనంతో వెలుగులోకి తెచ్చింది. నిధుల దుర్వినియోగంపై పంచాయితీరాజ్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. నిధుల దుర్వినియోగంపై దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలతో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించిన విషయం పాఠకులకు విధితమే. ఈ క్రమంలో రుద్రవరం మేజర్ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు బయట పడటంతో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ల నుంచి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. 2021 నుంచి 2025 మధ్య కాలంలో జరిగిన రూ. 2,13,83,297 కోట్లు బాధ్యుల నుంచి పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం రీకవ రి చేయాలని అందులో పొందుపరచారు. ఇప్పటికే రుద్రవరం మేజర్ పంచాయతీ ఇఓ సుబ్బారావుపై సస్పెన్షన్ వేటు పడిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆ సమయంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులతోపాటు స్పెషల్ ఆఫీసర్లపై చర్యలకు సిఫారస్ చేశారు. పర్యవేక్షణ లో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నాలుగేళ్ళుగా తనిఖీలు నిర్వహించని ఆడిట్ అధికారులపై చర్యలకు సిఫారస్ చేశారు. ఇందులో భాగస్వామ్యులైన సర్పంచ్‌తోపాటు అధికారులపై తీసుకున్న చర్యలతోపాటు నిధుల రీకవ రికి సంబంధించిన సమగ్ర వివరాలతో నివేదికను గత నెల 14 లోగా సమర్పించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సర్పంచి బైరి విజయలక్ష్మి చెక్ పవర్‌ను రద్దు చేశారు. నిధుల దుర్వినియోగంలో భాగస్వామ్యులైన వారిపై చర్యలు తీసుకొనేందుకు రంగం సిద్ధం అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆళ్లగడ్డ ట్రెజరీ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి.



సూర్య
www.suryaa.com
19 Jul 2025 - Page 7

భాగస్వామ్యులపై చర్యలకు కమిషనర్ ఆదేశాలు

- సూర్య వార్తకు స్పందన
- రుద్రవరం నిధుల దుర్వినియోగం రూ. 2.13 కోట్లు
- ఈవోఆర్డి, డీఎల్‌పిఓలపై క్రమ శిక్షణ చర్యలు
- రెండు వారాల్లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్లకు ఆదేశాలు
- నిధులను రాబట్టాలని ఆదేశాలు
- ఆడిటర్లపైన క్రమశిక్షణ చర్యలు

నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మేజర్ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు బయట పడింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ల నుంచి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. 2021 నుంచి 2025 మధ్య కాలంలో జరిగిన రూ. 2,13,83,297 కోట్లు బాధ్యుల నుంచి పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం రీకవ రి చేయాలని అందులో పొందుపరచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో రుద్రవరం మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం పై సూర్య దిన పత్రికలో నిధుల దుర్వినియోగం పేరుతో వార్తా కథనాన్ని అందించింది. ఇప్పటికే రుద్రవరం మేజర్ పంచాయతీ ఇఓ సుబ్బారావుపై సస్పెన్షన్ వేటు పడిన విషయం పాఠకులకు విధితమే. తాజాగా కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆ సమయంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులతోపాటు స్పెషల్ ఆఫీసర్లపై చర్యలకు సిఫారస్ చేశారు. పర్యవేక్షణ లో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. గత నాలుగేళ్ళుగా తనిఖీలు నిర్వహించని ఆడిట్ అధికారులపై చర్యలకు సిఫారస్ చేశారు. ఇందులో భాగస్వామ్యులైన సర్పంచ్‌తో పాటు అధికారులపై తీసుకున్న చర్యలతో పాటు నిధుల రీకవ రికి సంబంధించిన సమగ్ర వివరాలతో నివేదికను ఈ నెల 14 లోగా సమర్పించాలని ఆదేశించారు.

రుద్రవరం మేజర్ పంచాయతీలో రూ.1.82 కోట్ల నిధుల దుర్వినియోగం

ప్రచురితమైన సూర్య వార్తా కథనం

పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వుల జారీపై సూర్య వార్తకథనం

APPSC, TGPSC Group-1, 2, DSC Police Exams

# కరెంట్ అఫైర్స్

# ధన్‌ఖడ్ రాజీనామా

**14వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో తన పదవికి 21-07-2025న రాజీనామా చేశారు. రెండేళ్ల పదవీకాలం ఉన్నా ఆయన పదవి నుంచీ వైదొలగటం సంచలనం సృష్టించింది. రాజ్యసభ ఛైర్మన్ కూడా ఐన ఉపరాష్ట్రపతి తన పదవీ కాలానికి ముందే రాజీనామా చేయటం స్వతంత్ర భారత చరిత్రలో ఇది మూడోసారి. ఈ వివరాలు తెలుసుకుందాం...**

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ 21-07-2025న రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హెూదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాలవల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించుతున్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు 10 వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు.

**స్వతంత్ర భారత చరిత్రలో మూడో వ్యక్తి..**

స్వతంత్ర భారత చరిత్రలో ఉప రాష్ట్రపతి పదవిలో ఉండి పదవీకాలం ముగియకముందే రాజీనామా చేసిన వారిలో ధన్‌ఖడ్ మూడో వారు. అంతకుముందు ఇద్దరు రాజీనామా చేశారు. వారిలో వి.వి.గిరి రాష్ట్రపతి పదవికి పోటీ చేయడం కోసం రాజీనామా చేశారు. రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన భైరాన్‌సింగ్ షెకావత్ తన పదవీ కాలానికి నెల ముందుగా రాజీనామా చేశారు.

- రాజ్యాంగంలోని 67(ఎ) ప్రకారం ఆయన రాజీనామా చేశారు.
- అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.
- రాజ్యాంగంలోని అర్టికల్ 68వ నింబంధన ప్రకారం ఉపరాష్ట్రపతి రాజీనామా చేసినా, మరణించినా, ఇతర కారణాల వలన ఖాళీ అయిన వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉంది.
- ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన వారు మిగిలిన కాలానికి కాకుండ ఐదేళ్ల వరకు పదవీలో ఉంటారు.
- ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అయిన 60 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలి.

**భారత ఉపరాష్ట్రపతి- రాజ్యాంగ నిబంధనలు**

- **ఆర్టికల్ 63** - భారత ఉపరాష్ట్రపతి ఉంటారు
- **ఆర్టికల్ 64** - ఉపరాష్ట్రపతి మరే ఇతర వేతనంతో కూడిన పదవిని నిర్వహించరాదు మరియు కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ యొక్క వాస్తవిక ఛైర్మన్ గా పనిచేస్తారు.
- **ఆర్టికల్ 65** - కార్యాలయంలో స్వల్ప ఖాళీలు ఉన్నప్పుడు లేదా లేదా రాష్ట్రపతి లేనప్పుడు, ఉపరాష్ట్రపతి తన కోసం భర్తీ చేస్తారు
- **ఆర్టికల్ 66** - పార్లమెంటు ఉభయ సభల ప్రతినిధులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఉపరాష్ట్రపతి ప్రతినిధుల సభలో గానీ, ఏ రాష్ట్ర శాసనసభలో గానీ పనిచేయడానికి అనుమతి లేదు.
- **ఆర్టికల్ 67** - నియమితులైన నాటి నుంచి ఉపరాష్ట్రపతి పదవిలో అయిదేళ్ల పాటు ఉండాలి.
- **ఆర్టికల్ 68** - పదవీకాలం ముగియకముందే ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు ఓటింగ్ నిర్వహించాలి.
- ఉప రాష్ట్రపతి మరణం, రాజీనామా లేదా తొలగింపుతో మిగిలిపోయిన ఖాళీలను భర్తీ చేయడానికి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలి.
- **ఆర్టికల్ 69**- ఉపరాష్ట్రపతి రాష్ట్రపతి ముందు లేదా ఆ హోదాలో తాను నామినేట్ చేసిన వ్యక్తి ముందు ప్రమాణం చేయాలి.
- **ఆర్టికల్ 70**- ఇతర అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్రపతి విధులు నిర్వర్తిస్తారు.




**ఉపాధ్యక్షుడి గురించి వివరాలు**

- దేశంలో ఇప్పటిదాకా 16 సార్లు ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగగా నాలుగు సార్లే ఏకగ్రీవమైంది.
- ఏకగ్రీవంగా ఎన్నికైన ఉపరాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాథక్, మహ్మద్ హిదాయుతుల్లా, శంకర్ దయాళ్ శర్మ,
- అత్యధిక కాలం పనిచేసిన ఉపరాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, మహ్మద్ అన్సారీ - 10 సంవత్సరాలు
- రెండు సార్లు రాష్ట్రపతులుగా పనిచేసినది సర్వేపల్లి రాధాకృష్ణన్, మహ్మమద్ అన్సారీ
- అతి తక్కువ కాలం పనిచేసిన రాష్ట్రపతి వివిగిరి 1 సంవత్సరం 355 రోజులు
- తొలి దళిత ఉపరాష్ట్రపతి కెఆర్.నారాయణన్
- ఉపరాష్ట్రపదవి నిర్వహించి రాష్ట్రపతి పదవికి పోటీ చేసి ఓడిపోయిన ఏకైక వ్యక్తి భైరాన్ సింగ్ షెకావత్
- పదవికి తొలి సారిగా రాజీనామ చేసిన ఉపరాష్ట్రపతి - వి.వి.గిరి
- ఉపరాష్ట్రపతి పదవికి పదవీకాలంలో రాజీనామా చేసినది- వి.వి.గిరి, భైరాన్ సింగ్ షెకావత్, జగదీప్ ధన్‌ఖడ్

**ఉపరాష్ట్రపతిగా పనిచేసి రాష్ట్రపతులుగా పనిచేసిన వారు**

సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వి.వి.గిరి, ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్.

- స్వాతంత్ర్యానంతరం జన్మించిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్
- పదవీకాలంలో మరణించిన ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్
- అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ఆర్.వెంకట్రామన్, శంకర్ దయాళ్ శర్మ, కె.ఆర్.నారాయణన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు.
- రాజ్యసభలో నామినెటెడ్ సభ్యులకు ఓటు హక్కు ఉంటుంది.

**ఉపరాష్ట్రపతి ఎన్నిక విధానం**

- పార్లమెంట్ ఉభయసభలో సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకొంటారు.
- లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది సభ్యులున్నారు. పశ్చిమ బెంగాల్ లోని బసీర్ హాట్ సీటు ఖాళీగా ఉన్నది.
- రాజ్యసభలో 240 మంది ఉన్నారు. 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

**పార్లమెంట్ సభ్యుల వివరాలు**

లోక్‌సభ ప్రస్తుత సభ్యుల సంఖ్య 543. రాజ్యసభలో గరిష్టంగా 250 మంది సభ్యులు ఉంటారు, కానీ ప్రస్తుత సభ్యుల సంఖ్య 245. వీరిలో 233 మంది రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, మరియు 12 మంది రాష్ట్రపతి నామినేట్ చేయబడతారు.

- లోక్‌సభలో గరిష్ట బలం- 550 (రాష్ట్రాల నుండి 530, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 20)
- ఎన్నుకోబడిన సభ్యులు 543

**రాజ్యసభలో ప్రస్తుత బలబలాలు**

- ఎన్డీయే 133, ఇండియా కూటమి 78, ఇతరులు 29, ఖాళీలు 5

**లోక్‌సభలో సభలో ప్రస్తుత బలబలాలు**

- ఎన్డీయే 293, ఇండియా కూటమి 234, ఇతరులు 15, ఖాళీలు 1
- నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయ సభల మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మొత్తంగా 422 మంది సభ్యులు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు. అంటే నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే అభ్యర్థి ఎన్నిక లాంఛనమే.

## ఉపరాష్ట్రపతులుగా పనిచేసిన వ్యక్తుల వివరాలు

| ఉపరాష్ట్రపతి | రాష్ట్రం | పదవీకాలం | పోటీ అభ్యర్థి |
|---|---|---|---|
| 1. సర్వేపల్లి రాధాకృష్ణన్ | తమిళనాడు | 1952-1962 | ఏకగ్రీవం |
| 2. జాకీర్ హుస్సేన్ | ఆంధ్రప్రదేశ్ | 1962-1967 | ఎన్.సి.సమంత్సిన్హార్ |
| 3. వివి.గిరి | ఒడిశా | 1967-1969 | మహ్మమద్ హబీబ్ |
| 4. గోపాల్ స్వరూప్ పాథక్ | ఉత్తర ప్రదేశ్ | 1969-1974 | ఏకగ్రీవం |
| 5. బి.డి.జెట | కర్ణాటక | 1974-1979 | నిరల్ ఎనెమ్ హోరో |
| 6. మహ్మమద్ హిదాయితుల్లా | మధ్యప్రదేశ్ | 1979-1984 | ఏకగ్రీవం |
| 7. రామస్వామి వెంకట్రామ౦ | తమిళనాడు | 1984-1987 | బిసి కాంబ్లే |
| 8. శంకర్ దయాళ్ శర్మ | మధ్యప్రదేశ్ | 1987-1992 | ఏకగ్రీవం |
| 9. కె.ఆర్.నారాయణన్ | కేరళ | 1992-1997 | కాకా జోగీందర్ సింగ్ |
| 10. కృష్ణకాంత్ | పంజాబ్ | 1997-2022 | సుర్జీత్‌సింగ్ బర్నాల్ |
| 11. భైరోన్ సింగ్ షెకావత్ | రాజస్థాన్ | 2002-2007 | సుశీల్ కుమార్ సిండే |
| 12. మహ్మద్ అన్సారీ | పశ్చిమబెంగాల్ | 2007-2012 | నజ్మా హెప్తుల్లా |
| మహ్మద్ అన్సారీ | | 2012-2017 | జశ్వంత్ సింగ్ |
| 13. వెంకయ్య నాయుడు | ఆంధ్రప్రధేశ్ | 2017-2022 | గోపాల కృష్ణ గాంధీ |
| 14. జగదీప్ ధన్‌ఖడ్ | రాజస్థాన్ | 2022-2025 | మార్గరెట్ అల్వా |

**జగదీప్ ధన్‌ఖడ్ రాజకీయ ప్రస్థానం**

- **జననం :** మే18,1951న రాజస్థాన్‌లోని ఝుంఝునను జిల్లాలోని కితానా గ్రామంలో హిందూ రాజస్థానీ కుటుంబంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గోకల్‌చంద్, కేసరీ దేవి.
- 1979లో రాజస్థాన్‌హైకోర్టులో లాయర్‌గా చేరిక
- 9వ లోక్‌సభ సభ్యుడిగా 1989-91 ఎన్నిక
- 1989లో జనతాదళ్ ఎంపిగా ఎన్నిక
- చంద్రశేఖర్ కేబినెట్‌లో పార్లమెంట్ వ్యవహారాల సహాయమంత్రిగా పని చేశారు.(1990-91)
- రాజస్థాన్ రాష్ట్ర శాసనసభ (1993-98) కు అజ్మేర్ కిషన్‌ఘడ్ నియోజకవర్గం నుండి శాసన సభ్యుడిగా ఎన్నిక.
- 2003లో బిజెపీలో చేరిక
- 2019-22 పశ్చిమ బెంగాల్ గవర్నర్ గా నియామకం.

**అనంతారపు కృష్ణయ్య,** డైరెక్టర్
శ్రీ సాయి కోచింగ్ సెంటర్, కోదాడ,
సూర్యాపేట (జిల్లా),
99487 50605



**శ్రీదాశరథి కృష్ణమాచార్య అవార్డు**

ప్రతిష్టాత్మక శ్రీదాశరథి కృష్ణమాచార్య అవార్డును 2025 సంవత్సరానికి ప్రముఖ కవి, వ్యాసకర్త అన్నవరం దేవేందర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జులై 22న దాశరథి జయంతి సందర్భంగా ప్రభుత్వం ఈ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. ఈ అవార్డును సాహిత్యరంగంలో విశేష సేవలు అందించిన కవులకు, రచయితలకు ప్రధానం చేస్తారు.

For Daily Current Affairs
శ్రీ సాయి కోచింగ్ సెంటర్,
YOU TUBE CHANNEL

## డియస్సీ గ్రూప్-1, గ్రూప్-2 జె.ఎల్.,

# జాగ్రఫీ



**1. విషవత్తులు అనగా**

1. మార్చి 21న, సెప్టెంబరు 23న ప్రపంచమంతా పగలు, రాత్రి సమానంగా ఉండుట.
2. జూన్ 21న సూర్యుడు కర్కటరేఖపై నిటారుగా పడుట.
3. డిసెంబర్ 22న, సూర్యుడు మకరరేఖపై నిటారుగా పడుట.
4. జూన్ 21న, డిసెంబరు 22న పగలు, రాత్రులు సమానంగా ఉండుట.

**2. భూభ్రమణ దశ**

1. తూర్పు నుండి పడమరకి
2. పడమర నుండి తూర్పుకు
3. ఉత్తరం నుండి దక్షిణంకి
4. దక్షిణం నుండి ఉత్తరంకి

**3. భూ పరిభ్రమణానికి పట్టు సమయం**

1. 365 రోజులు 2. 366 రోజులు
3. 365 రోజుల 5.56 గంటలు
4. 366 రోజుల 5.56 గంటలు

**4. అక్ష ధృవత్వం అనగా**

1. రాత్రి వేళల్లో దక్షిణాన ధృవనక్షత్రాన్ని చూడటం
2. భూమి అక్షం ఎల్లపుడు ఒకే వైపుకు ఉండకపోవటం
3. భూమి అక్షం అప్పుడప్పుడు ధృవనక్షత్రం వైపు ఉండటం.
4. భూమి అక్షం ఎల్లపుడు ధృవనక్షత్రాన్ని చూపించడం.

**5. క్రింది వాటిని పరిశీలింపుము.**

ప్రతిపాదన (ఎ) - సూర్యుడు తూర్పున ఉదయించి పశ్చిమాన అస్తమిస్తున్నాడు.

కారణం (ఆర్) - భూమి పడమర నుండి తూర్పుకి భ్రమణం చెందుతుండడం వలన.

1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) నిజమైనది కాని (ఆర్) నిజమైనది కాదు.
4. (ఎ) నిజమైనది కాదు కాని (ఆర్) నిజమైనది.

**6. క్రింది వాటిని జతపరచుము.**

| రోజు | సూర్యుని కిరణాలు ప్రసరించే అక్షాంశం |
|---|---|
| 1. మార్చి 21 | ఎ. $0^0$ అక్షాంశం |
| 2. జూన్ 21 | బి. భూమధ్యరేఖ |
| 3. సెప్టెంబరు 23 | సి. మకరరేఖ |
| 4. డిసెంబరు 22 | డి. కర్కటరేఖ |

1. 1-ఎ,2-బి,3-సి,4-డి
2. 1-బి,2-డి,3-ఎ,4-సి
3. 1-డి,2-సి,3-బి,4-ఎ
4. 1-సి,2-బి,3-ఎ,4-డి

**7. క్రింది ఏ పరిస్థితులు ధృవ ప్రాంతాల్లో కనిపిస్తాయి?**

ఎ. పగలు ఉన్న సమయంలో సూర్యుని కిరణాలు నిటారుగా పడతాయి.

బి. ధృవ ప్రాంతం సూర్యోదయం అయ్యే ప్రదేశానికి కొంచెం ఎత్తులో ఉంటుంది.

సి. ఆర్కిటిక్ సముద్రం సంవత్సరం పొడవునా గడ్డకట్టుకుపోయేంత చలి పరిస్థితులు ఉంటాయి.

1. ఎ మాత్రమే 2. ఎ మరియు సి
3. బి మరియు సి 4. ఎ,బి మరియు సి

**8. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతూ అక్షం వంగి లేదనుకుంటే క్రింది ఏ పరిస్థితి ఏర్పడి ఉండేది?**




## భూ చలనాలు - ఋతువులు

1. ఇప్పుడు ఉన్న పరిస్థితులే ఉండావి.
2. ధృవాలకు ఎక్కువ వేడి లభించేది.
3. చంద్రుడిపై ఉన్న పరిస్థితులు భూమిపై ఉండేవి
4. ఉత్తర, దక్షిణార్ధ గోళాలకు ఒకే మోతాదులో వేడి లభించేది.

**9. క్రింది అంశాల వాస్తవికతను గుర్తించుము.**

ప్రతిపాదన (ఎ) - ధృవప్రాంతంలో వేసవికాలం (పగలు) ఉన్న 6 నెలల కాలంలో కూడా అంతగా వేడెక్కదు.

కారణం (ఆర్) - సూర్యోదయం అయ్యే ప్రదేశానికి (క్షితిజ రేఖ లేదా దిగ్మండలం) కొంచెం ఎత్తులో ధృవప్రాంతం ఉంటుంది.

1. (ఎ) మరియు (ఆర్) రెండూ సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ.
2. (ఎ) మరియు (ఆర్) సరైనవే మరియు (ఎ)కి (ఆర్) సరియైన వివరణ కాదు.
3. (ఎ) తప్పు కాని (ఆర్) నిజం
4. (ఎ) నిజం కాని (ఆర్) తప్పు.

**10. అర్ధరాత్రి సూర్యుడు ఉదయించే దేశం**

1. జపాన్ 2. ఇంగ్లాండ్
3. నార్వే 4. థాయ్‌లాండ్

**11. క్రింది వాక్యాలను పరిశీలించి వాటిలో సరైన అంశాలను గుర్తించుము.**

ఎ. భారతదేశంలో దక్షిణాన తమిళనాడు, కేరళ, అండమాన్‌లలో చలికాలంలో చాలా చల్లగా ఉండదు.

బి. ఈశాన్య రాష్ట్రాలలో వేసవికాలంలో చాలా వేడిమి ఉండదు.

సి. ఉత్తర భారతదేశంలో ఎక్కువభాగం ఈ మూడు కాలాల్లో వెచ్చని వేసవికాలాలు, చల్లటి శీతాకాలాలు మరియు వర్షపు ఋతుపవనాలు ఉండవు.

1. ఎ మాత్రమే 2. ఎ మరియు బి
3. బి మాత్రమే 4. ఎ,బి మరియు సి

**12. క్రింది వాటిలో సరిగ్గా జత చేసిన దానిని గుర్తించుము.**

ఎ. భూమధ్యరేఖకు పూర్తిగా ఉత్తరాన ఉన్న ఖండం ఐరోపా

బి. భూమధ్యరేఖకు పూర్తిగా దక్షిణాన ఉన్న ఖండం ఆస్ట్రేలియా

సి. భూమధ్యరేఖకు ఉత్తరాన, దక్షిణాన విస్తరించిన ఖండం ఉత్తర అమెరికా

1. ఎ మరియు బి 2. బి మరియు సి 3. ఎ మరియు సి 4. ఎ,బి మరియు సి

**13. క్రింది వాటిలో ఏది కాలాల క్రమాన్ని ప్రభావితం చేయని అంశం?**

ఎ. భూమి బంతిలాగా గోళాకారంలో ఉండటం, దాని ఉపరితలం ఒంపు తిరిగి ఉండటం

బి. భూమి భ్రమణం చెందటం.

సి. భూమి చుట్టూ చంద్రుడు నెలకు ఒకసారి తిరగటం.

డి. సూర్యుడి చుట్టూ భూమి తిరిగే తలంతో పోలిస్తే తన చుట్టూ తాను తిరిగే అక్షం ఒంపు కలిగి ఉండటం.

ఇ. భూమి పరిభ్రమణం

1. ఎ మరియు బి 2. బి మరియు ఇ
3. సి మాత్రమే 4. డి మాత్రమే

**14. క్రింది అంశాల వాస్తవికతను గుర్తించుము.**

ఎ. సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నపుడు సంవత్సరమంతా దాని అక్షం ఒకే వైపుకు వంగి ఉండదు.

బి. అది ధృవనక్షత్రం వైపు చూపిస్తూ ఉండుటను 'అక్ష ధృవత్వం' అంటారు.

సి. రాత్రివేళ్ళల్లో ఉత్తరాన ధృవనక్షత్రం కనిపిస్తుంది.

1. ఎ & బి నిజం, సి తప్పు
2. ఎ,బి & సి నిజం
3. ఎ నిజం, బి & సి తప్పు
4. ఎ తప్పు బి మరియు సి నిజం

**15. క్రింది వానిలో సరిగ్గా జత చేసిన దానిని గుర్తించుము.**

ఎ. కర్కటరేఖ నుండి మకరరేఖకు మధ్య ఉన్న ప్రాంతం : ఉష్ణ మండలం.

బి. ఉష్ణమండలం - ధృవమండలం మధ్య ఉన్న ప్రాంతం : అతిశీతల మండలం.

సమ శీతోష్ణమండలం నుండి ధృవాల బిందువుల వరకు : శీతల మండలం.

1. ఎ మరియు సి 2. ఎ మరియు బి
3. బి మరియు సి 4. ఎ,బి మరియు సి

**16. భూమిపై కాలాల క్రమాన్ని ప్రభావితం చేయని అంశం?**

1. భూ భ్రమణం
2. భూమి అక్షం ఒంపు కలిగి ఉండటం
3. భూ పరిభ్రమణం
4. ఖండాలు, మహాసముద్రాల విస్తరణ

**17. భూమి అక్షం**

1. $66\frac{1}{2}^0$ వంగి ఉంది
2. $23\frac{1}{2}^0$ వంగి ఉంది
3. $90^0$ కోణంలో కక్ష్య తలంపై ఉంటుంది.
4. వంగి ఉండి, సంవత్సరమంతా ఒకే వైపుకు ఉండదు.

**18. క్రింది వాటిలో సరిగ్గా జతపరచిన వాటిని గుర్తించుము.**

ఎ. కర్కటరేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెల జూన్

బి. మకరరేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెల డిసెంబరు.

సి. భూమధ్య రేఖపై నిటారుగా సూర్యకిరణాలు పడే నెలలు జనవరి, అక్టోబరు.

1. ఎ మరియు సి 2. బి మాత్రమే
3. ఎ మరియు బి 4. సి మాత్రమే

**19. పగలు-రాత్రులు సంభవించడం, స్థానిక ఉష్ణోగ్రతలు గాలులు కదలికలకు కారణం క్రింది వాటిలో ఏది?**

1. భూ భ్రమణం 2. భూ పరిభ్రమణం
3. చంద్రుడు భూమి చుట్టూ తిరగడం
4. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ భూమి చుట్టూ తిరగడం.

**20. సూర్యుడు ప్రకాశవంతంగా చేసే భూమి యొక్క గోళాకారపు అంచును ఏమంటారు?**

1. ప్రకాశ అంచు 2. ప్రకాశ భూమి
3. ప్రకాశ అర్ధవృత్తం 4. ప్రకాశ వృత్తం.

**జవాబులు :** 1)1, 2)2, 3)3, 4)4, 5)1, 6)2, 7)3, 8)4, 9)1, 10)3, 11)2, 12)1, 13)3, 14)4, 15)1, 16)4, 17)2, 18)3, 19)1, 20)4

**పాదం సుధాకర్**
ఫ్యాకల్టీ
9849972622



## రచనలకు ఆహ్వానం

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.

# ఆపదలో ఆపన్న హస్తం అందించే వాడే నిజమైన నేస్తం

**లయన్స్ క్లబ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం..**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. లయన్స్‌క్లబ్‌అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన లయన్స్ క్లబ్‌లో, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి.రమణయ్య అధ్యక్షతన దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ఉత్సవాలలో సభ్యులు పరస్పరం ఫ్రెండ్షిప్ డే రిస్ట్ బ్యాండ్ (స్నేహితుల దినోత్సవ మణికట్టు బ్యాండ్) కట్టుకుని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్‌కు, దివ్యాంగుల సంక్షేమ సంఘానికి విశేష సేవలందిస్తున్న డాక్టర్ రవి కృష్ణ ను గజమాల, శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఆపన్న హస్తం అందించే వారే నిజమైన స్నేహితులని అన్నారు. కుల మత వర్గాలకు అతీతంగా, ధనిక, పేద తేడాలు లేకుండా ఉండే స్వచ్ఛమైన స్నేహం జీవితాంతం నిలుస్తుందన్నారు. గొప్ప స్నేహ బంధానికి శ్రీకృష్ణుడు, కుచేలుడు గొప్పతార్కాణంగా నిలుస్తారని అన్నారు. లయన్స్ క్లబ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం, కళారాధన, క్రీడా సంఘాలు, ఐఎంఏ తరపున సేవా కార్యక్రమాలు ఈ సంస్థల సభ్యుల స్నేహ సహకారంతో నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సోమేశుల నాగరాజు, తాతిరెడ్డి భాస్కర రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, రీజియన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి ,జోన్ చైర్మన్ నిజాముద్దీన్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంపీ వి రమణయ్య, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, కార్యదర్శి రామలింగం, లయన్స్ క్లబ్ సభ్యులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



డాక్టర్ రవి కృష్ణ కు ప్రపంచ స్నేహితుల దినోత్సవ సత్కారం చేస్తున్న నంద్యాల లయన్స్ క్లబ్ నాయకులు

# సైబర్ నేరగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. సి ఐ. పులిశేఖర్



**తుగ్గలి ,మేజర్ న్యూస్:** సైబర్ నేరగాల్ల పట్ల యువతీ,యువకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ రూరల్ సీఐ పోలీస్ శేఖర్అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కువయ్యారన్నారు. అందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటిపి అడిగినా వాటిని నిర్ధారణ చేసిన తర్వాతనే ఓటిపి చెప్పాలన్నారు. సైబర్ నేరగాళ్లు తమను ఏదో విధంగా వలలో గడపడానికి ఫోన్లు, ఫేస్బుక్లో అకౌంట్ లో పెట్టి తమను ఇబ్బందులకు గురి చేస్తారని అయితే వాటిని పక్కన పెట్టాలన్నారు. ఇప్పటికే చాలామంది సైబర్ నేరగాళ్ళ వల లోపడి అకౌంట్లో ఉండే డబ్బులు పోగొట్టుకోవడం జరిగిందన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తగాఉండాలని కోరారు. ప్రభుత్వ అధికారులమని, ఎల్ఐసి, పోలీసు వారమని చెప్పి వారి వలలోకి లాగుతారని అటువంటివి నమ్మదని కోరారు. అలాంటి ఫోన్లో వచ్చిన సంబంధిత పోలీస్ స్టేషన్ లకు సమాచారం ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# విలువైన బంధం – స్నేహం

**– ఎన్.పి. స్కూలులో ఘనంగా స్నేహితుల దినోత్సవం**

**ఆస్పరి, మేజర్ న్యూస్ :** విలువైన బంధం స్నేహమని ప్రధానోపాధ్యాయులు నరేష్ ఆచారి,పవన్ భరద్వాజ్‌లు పేర్కొన్నారు. ఆదివారం నారాయణ ప్రైమ్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవితంలో దేవుడు మనకు ఎన్నో బంధాలు ఇస్తాడు కానీ మనమే మనస్సుతో ఏర్పరుచుకునే అత్యంత విలువైన బంధం – స్నేహం, స్వార్థం లేని ప్రేమ, అండగా నిలిచే ఆసరా, ఆనందాన్ని పంచుకునే సహచర్యం ఇవన్ని ఒక నిజమైన మిత్రుడి లక్షణాలు అలాంటి అపూర్వమైన అనుబంధానికి ఘనత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం ఫ్రేండ్‌షిప్‌డేగా జరుకుంటామన్నారు. విద్యార్థులు స్నేహభావంతో ఉండాలని పాఠశాల ఉపాధ్యాయులు, కాలీద్, సతీష్ కుమార్, నీలకంత, ఈశ్వర్, లవాణ్య, నిజం, సీత రాముడు, పద్మావతి, ఆశ్విని, పవిత్ర, త్రీవేణి తదితరులు విద్యార్థులకు తెలియజేశారు.



కేక్ కేట్ చేస్తున్న స్నేహితులు

# జీడీపీకి నిలిచిపోయిన ఎల్లెల్సీనీరు

(మొదటి పేజి తరువాయి)



కుడికాలువ ద్వారా పంటలకు జీడీపీ నీరు విడుదల అయిన దృశ్యం

**హంద్రీనీవా నుంచి రోజుకు 110 క్యూసెక్కుల నీరు మాత్రమే:** హంద్రీనీవా (శ్రీశైలం బ్యాక్ వాటర్) నుంచి జీడీపీకి గత 15 రోజులుగా రోజుకు 110 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఈ నీరు ప్రస్తుతం ప్రాజెక్టుకు జీవనాధారం హంద్రీనీవా నీరు లేక పోతే ప్రాజెక్టు ఎండిపోయి ఉండేది. దీని కింద ఉన్న పంటలు, తాగునీటి పథకాలకు, నీరు లేక ఇబ్బందులు వచ్చేవి. గత నాలుగు రోజుల నుంచి జీడీపీకి మళ్లించిన ఎల్లెల్సీ నీరుకూడా నిలిపి వేశారు. ఇదే పద్దతి కొనసాగితే ఇక ప్రాజెక్టు కు నీటి ఇక్కట్లు తప్పవని చెప్పవచ్చును.

**ఎడవ కాలువ ద్వారా కోడుమూరుకు త్రాగునీటికి 70 క్యూసెక్కులు విడుదల:** వర్షాలు కురియ పోవడం కారణంగా గ్రామాలలో తాగునీటి ఇక్కట్లు వస్తున్నాయి అందులో బాగంగా కోడుమూరు, ఆ పరిసర ప్రాంతాలలో తాగునీటి ఇబ్బందులు తలెత్తడంతో గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులు 10 రోజుల నుంచి కోడుమూరుకు జీడీపీ ఎడవ కాలువ ద్వార రోజకు హంద్రీనదికి 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కోడువయూరు కు పరిసర ప్రాంతాల గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు తీరనున్నాయి. కోడుమూరు హంద్రీనదిని చేరితే కోడుమూరు తాగునీటికి 30 క్యూసెక్కుల నీరు వదలి మిగత 40 క్యూసెక్కుల నీటిని ఎల్లెల్సీ కింద పంటలు సాగు చేసుకున్న రైతులకు మళ్లిస్తున్నట్లు జీడీపీ అధికారులు తెలుపుతున్నారు.

**కుడికాలువ ద్వార 100 క్యూసెక్కుల నీరు విడుదల:** ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో రైతులు వర్షాలు కురుస్తాయాన్న ఆశతో ఎక్కువగా పత్తి పంటను సాగు చేసుకున్నారు. అయితే వర్షాలకు కురియక పోవడంతో పంట ఎండిపోతుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు కుడికాలువ ద్వారా రోజుకు 100 క్యూసెక్కుల నీటిని సాగు చేసిన పంటలకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కింద కేవలం రబీ సీజన్లో మాత్రమే పంటలకు విడుదల చేయాలి కాని ఖరీఫ్ సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో నీటిని విడదలు చేసి రైతులకు అందిస్తున్నారు.

**జీడీపీకి నిలిచిపోయిన ఎల్లెల్సీ మళ్లింపు:** గాజులదిన్నె ప్రాజెక్టుకు గత 15 రోజులుగా ఎల్లెల్సీనీటిని మళ్లించారు. అయితే గత నాలుగురోజులుగా జీడీపీకి నీటి విడుదలను ఎల్లెల్సీ అధికారులు నిలిపివేశారు. గోనెగండ్ల కు ప్రస్తుతం ఎల్లెల్సీ నుంచి 75 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల అవుతుంది. అందులో 30 క్యూసెక్కుల నీటిని కోడుమూర పంట పొలాలకు మళ్లించి మిగిలిన 45 క్యూసెక్కుల నీటిని గోనెగండ్ల పంట పొలాలలకు తాగునీటి పథకాలను మళ్లిస్తున్నారు. ఇక జీడీపీ కేవలం హంద్రీనీవా నీటి పైనే ఆధాపడి ఉంది. ఇక జీడీపి కింద రబీలో సాగుకు నీటి ఎలా అన్నది ప్రశ్నార్ధకంగా మారుతుందని ఆయకట్టు రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకై కృషి చేద్దాం..

**– పార్టీ బలోపేతానికి పాటుపడదాం – జనసేన ఇంఛార్జీకు కార్యకర్తలు సన్మానం**



జనసేన ఇంఛార్జీని శాలువలతో సన్మానిస్తున్న కార్యకర్తలు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని జనసేన మంత్రాలయం ఇంచార్జి లక్ష్మన్న పిలుపునిచ్చారు. ఆదివారం జనసేన కార్యకర్తలు మంత్రాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో మనం కూడ భాగస్వాములు కాబట్టి మనకు రావాల్సిన నామినేటెడ్ పదవులు రేషన్ డీలర్ బుక్కీపరులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు తప్పకుండా వస్తారన్నారు. ఎవరు నిరాశ పడకుండా జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం కార్యకర్తలు పార్టీ ఇంచార్జినిశాలువలుకప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్న రమేష్, ఎంకప్ప, నాగరాజు, మూకప్ప, శివ, రాజేష్, గంగాదర్, నాగప్ప, ఈరన్న, రవి, శివరాం, పాల్గొన్నారు.

# 5న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ధర్నా

**:– ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపు**

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆద్వర్యంలో ఈ నెల 5వ తేదీన ఇండస్ట్రీ ఎస్టేట్‌లో ఉన్న కరెంట్ ఆఫీస్ ముందు జరుగు ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం ఐక్యవేదిక ఆద్వర్యంలో 32వ వార్డు సుందరయ్య నగర్ ఆటో స్టాండ్ దగ్గర సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప, వై సుధాకర్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్ హుస్సేన్ బాష, కెవిపిఎస్ నగర సహాయ కార్యదర్శి ఎంసి ఆనంద్‌లు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లు చేస్తామని కరెంటు చార్జీలు పెంచమని వాగ్దానం జరిగిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి అనుసరించిన విధానాలను కూటమి ప్రభుత్వం అనుసరిస్తూ దాదాపు ట్రూఅప్ చార్జీలు రూ.20వేలు ప్రజలపై భారాలు మోపిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దగ్గరుండి స్మార్ట్ మీటర్లను బిగించడం జరుగుతుందని ఇది ప్రజలను వంచించి మోసగించడం అని వారన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై భారాలు పడడమే కాకుండ మీటర్ చార్జి వినియోగదారుడు భరించాలని ఇది 99కంతులలో కరెంటు బిల్లులో వస్తుందని అలాగే రాత్రి ఒక రేటు పగలు ఒక రేటు ప్రకారం చార్జీలు నిర్ణయించి భారాలు వేస్తారని వారు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించడం వల్ల స్మార్ట్ మీటర్‌లో రీచార్జ్ సిస్టం ఉంటుందని దాని వల్ల వినియోగదారుడు ముందుగానే డబ్బులు చెల్లించి కరెంటును సరఫరా చేసుకోవాల్సి వస్తుందని డబ్బులు అయిపోయిన వెంటనే కరెంటు పోతుందని ఏ అర్థరాత్రి కరెంటు పోయినా మనం చిమ్మ చీకట్లో మగ్గాల్సి వస్తుందని వారు తెలిపారు. స్మార్ట్ మీటర్లు వద్దని ప్రజలందరు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కె సురేష్, జి రాజు, కె మునిస్వామి, టి రామనాగిరెడ్డి, వీరస్వామి, బషీర్ అహ్మద్, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

# దొంగతనాల కేసుల్లోని నిందితులు అరెస్ట్

**5 తులాల బంగారు..20తులాల వెండి కాళ్ళ పట్టీలు స్వాధీనం**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** నంద్యాల జిల్లా ఎస్పి ఆదిరాజ్‌సింగ్ రానా, డోన్ డిఎస్పి శ్రీనివాసులుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని హుస్సేనాపురం, మామిళ్ళపల్లె గ్రామాలలో గతనెలలో వరుస దొంగతనాలు చేసిన కేసుల్లో నిందితులుగా ఉన్న అనంతపురం జిల్లా, యాడికి పట్టణం, చిన్నతోటకు చెందిన జోగి రాజ, అనంతపురం జిల్లా, గుత్తి మండలం, తొండపాడు గ్రామానికి చెందిన మునగాల సుంకన్న అనే వ్యక్తులను ఈనెల 2వ తేదిన సాయంత్రం 6:00 గంటలకు బావిపల్లె క్రాస్ రోడ్డు వద్ద అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 5 తులాల బంగారు, 20 తులాల వెండి కాళ్ళపట్టీలను స్వాధీనం చేసుకొని, వారిని అదుపులోకి తీసుకున్నట్లు ప్యాపిలి సిఐ ఎం.వెంకటరామిరెడ్డి, జలదుర్గం ఎస్సై నాగార్జునలు ఆదివారం పాత్రికేయుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ వెంకటరామిరెడ్డి, ఎస్సై నాగార్జున, పోలీసు సిబ్బందిని జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ నీలకంత, రమణ, పోలీసు కానిస్టేబుళ్ళు మాధవరెడ్డి, వెంకటరాజు, మాదన్న, నరసయ్య, మద్దిలేటి, అశోక్‌కుమార్, హోంగార్డులు హుస్సేన్‌భాషా, మహబూబ్‌భాషలు పాల్గొన్నారు.



సూర్య
సోమవారం | 04 ఆగస్టు 2025

# శ్రీశైలం మల్లన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం


ఆలయ క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ద్వాదశ జ్యోతిర్లింగం,అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైనా శ్రీశైల క్షేత్రానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు.రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.పాతాళగంగలో పుణ్యస్నానాల అనంతరం దర్శనార్థమై ఆలయ క్యూలైన్లో బారులు తీరారు.దీంతో ఉచిత, శీఘ్ర,అతిశీఘ్ర క్యూ లైన్లన్నీ భక్తులతో కిక్కిరిశాయి.భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది.


ట్రాఫిక్ జామ్ తో నిలిచిపోయిన వాహనాలు

**భారీగా ట్రాఫిక్ జాం..భక్తులకు తప్పని ఇక్కట్లు :** ఇటు శ్రీశైల మల్లన్నను దర్శించుకుని అటు డ్యాం అందాలను తిలకించేందుకు ఆదివారం భక్తులు శ్రీశైలానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు.దీంతో ఘాట్ రోడ్లో వాహన రాకపోకలు స్తంభించాయి.డ్యాం సమీపంలో నుంచి తెలంగాణ రాష్ట్ర పరిధిలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడి భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. పోలీసులు శ్రమించి ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేశారు.

## 'క్రెడాయ్' సామాజిక బాధ్యత అభినందనీయం

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్
- గడియారం ఆసుపత్రి నిర్వహణ క్రెడాయ్‌కి అప్పగింత
- ఎంవోయూపై కమిషనర్, క్రెడాయ్ ప్రతినిధుల సంతకాలు


ఒప్పంద పత్రాన్ని అందిస్తున్న కర్నూలు కమీషనర్ విశ్వనాథ్

**కర్నూలు క్రైమ్, మేజర్ న్యూస్ :** ప్రముఖ రియల్ ఎస్టేట్ రంగ సంస్థ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సామాజిక బాధ్యతగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కొనియాడారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను క్రెడాయ్ సంస్థకు బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు. కమిషనర్, క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్లరమణ ఎంవోయూపై సంతకాలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో దశాబ్దాల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతగా క్రెడాయ్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. రాబోయే పదేళ్ళ పాటు నిర్వహణ బాధ్యతలను అప్పగించామని,శనివారంఈ తీర్మానానికి పాలకవర్గంఆమోదం తెలిపిందన్నారు. ఈ పరిణామం వల్ల గడియారం ఆసుపత్రి సమీప ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, గడియారం ఆసుపత్రి అభివృద్ధి కోసం క్రెడాయ్ సంస్థకు కార్పొరేషన్ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సూచనల మేరకే గడియారం ఆసుపత్రిని పదేళ్ల పాటు దత్తత తీసుకోవడం జరుగుతుందన్నారు. తొలుత రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపడతామని, మంత్రి, అధికారుల సహకారంతో ఆసుపత్రిలో వైద్య సిబ్బంది పెంపునకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఆసుపత్రి ఆధునికీ కరణ పనులకు ప్రణాళికలు రూపొందించామని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ క్రిష్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ మంజూర్ బాష, క్రెడాయ్ సంస్థ సభ్యులు జి.సాయిరాం రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, గోవర్ధన్, ప్రకాష్, రంగనాథ్ రెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### గోనెగండ్లలో వికసించిన శ్రీకృష్ణపరమాత్మ (రాఖీ) పుష్పం

**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్లలో అరుదైన శ్రీకృష్ణపరమాత్మ(రాఖీ) పుష్పాలు ఆదివారం వికసించాయి. గోనెగండ్లలో డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు పెరట్లో పుష్పాలు వికసించి కనువిందు చేస్తున్నాయి. కొందరు ఈ పుష్పాలను శ్రీకృష్ణ పుష్పాలని, మరికొందరు కౌరవ, పాండవ పుష్పాలని, ఇంకొందరు శ్రావణమాసంలో ఎక్కువగా వికసిస్తున్నాయి కావునా రాఖీ పుష్పాలని పిలుస్తున్నారు. ఈ సందర్భంగా గురురాజారావు మాట్లాడుతూ ఈ పుష్పాలను కొమ్మ నుండి వేరుచేసిన అరగంట తర్వాత సుగంధ పరిమళం వెదజల్లుత ఉందన్నారు. ఈ పుష్పాలను దైవానికి మాత్రమే సమర్పిస్తామని తెలిపారు. వికసించిన పుష్పాలను చూసేందుకు గ్రామస్థులు ఆసక్తి కనబరిచారు.


వికసించిన శ్రీకృష్ణపరమాత్మ (రాఖీ)పుష్పం

## సంతోష్ నగర్‌లో చోరీ

:- 6తులాల బంగారు, రూ.2లక్షల నగదు అపహరణ

**కర్నూలు క్రైం , మేజర్‌న్యూస్ :** నగరంలోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న సచివాలయ ఉద్యోగి బాలకృష్ణ ఇంటికి తాళం వేసి వెళ్లగా ఆదివారం మధ్యాహ్నం పట్టపగలు ఇంట్లో దొంగలు పడి 6తులాల బంగారు, రూ.2లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు 4వ పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సంతోష్ నగర్‌లోని అష్టలక్ష్మి గుడి వెనకాల భాగంలో కోనేటమ్మపల్లె గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న బాలకృష్ణ దంపతులు ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల వివాహానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తాళం, బీరువా తాళం పగలగొట్టి ఉండడంతో దొంగలు పడ్డారని గమనించి [illegible] పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే 4వ పట్టణ సిఐ విక్రమసింహా తన సిబ్బందితో ఇంటి వద్దకు వెళ్లి దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించి బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


బీరువా తాళం పగలగొట్టి దొంగతనం చేసిన దృశ్యం







# వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

**వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి**
**పీహెచ్ సీలలో డెలివరీల సంఖ్య పెంచాలి**
**ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
**సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాల సమస్యల పరిష్కారానికి కృషి**
**నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**
**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**శ్రీశైలం,మేజర్‌న్యూస్:** వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.ఆదివారం శ్రీశైలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతోందన్నారు. శ్రీశైలంలోని ప్రాథమిక హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు.చేతిలోచిల్లి గవ్వలేని పేదలు మాత్రమే ప్రభుత్వాసుపత్రులకు వస్తుంటారని వైద్యులు పేదల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మానవత్వంతో వారికి వైద్యం అందించాలన్నారు.ప్రజలు ఎంతో నమ్మకముతో ప్రభుత్వ వైద్యశాలకువస్తారని ఆనమ్మకాన్ని పోగొట్టకుండా వారికి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్సీలలో గర్భవతులకు అన్ని వసతులు కల్పించి డెలివరీల సంఖ్య పెంచి ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవం గావించే విధంగా చూడాలన్నారు. వైద్యులు రోగులకు అవసరమైనన్ని మందులు అందుబాటులో ఉంచుకొని మందుల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీహెచ్ సి లలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి,ప్రతిరోజు ఎంతమంది పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నారు.వైద్యులు అందుబాటులో ఉన్నారా లేదా. ఇక్కడ ఎంతమంది డాక్టర్లు, సిబ్బంది పని చేస్తున్నారు.ప్రతి వార్డులో అన్ని రకాల పరికరాలు ఉన్నాయా లేదా..ఏమైనా సమస్యలు ఉన్నాయా..అని అక్కడివైద్యసిబ్బందినిపేషెంట్లనుఅడిగి తెలుసుకున్నారు. ఇక్కడ పనిచేసే వైద్యులు,సిబ్బంది బాగా పనిచేసి ఆసుపత్రికి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ వారికి తెలిపారు.సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలోనే వైద్యశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని స్థానిక ప్రజలతో పాటు చెంచు గిరిజనుల కోసం వైద్యశాలల సమస్యలను పరిష్కరిస్తామన్నారు.ఈ సందర్భంగా వైద్యశాల నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్కు సిబ్బంది విన్నవించారు.అలాగే పలువురు రోగులు కూడాసున్నిపెంటసమస్యలనుకలెక్టర్‌దృష్టికి తీసుకెళ్లారు.


ఆలయ ప్రాంగణంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి

**మల్లన్న సేవలో జిల్లా కలెక్టర్ రాజకుమారి :** శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద కలెక్టర్కు ఈవో శ్రీనివాసరావు,అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం శేష వస్త్రం,లడ్డూ, ప్రసాదాలు చిత్రపటంతో కలెక్టర్లు సత్కరించారు.